క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆమనగల్లు: మాడ్గుల మండలంలో గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించనున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారని, ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న నాయకులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందులో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి.. వాటిని సంరక్షించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. మానవాళి మనుగడకు, కాలుష్యరహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జీఎస్‌ఆర్ యువసేన నాయకులు సిద్దిగారి దాస్, మణికంఠ, నవీన్, సోనూ, చిట్టి, శ్రీకాంత్, రాజు, అంజి, కర్ణాకర్, శివ, సంతోష్, నిఖిల్, సాయి, అరవింద్, నరేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది దుకాణాల అద్దెకు వేలం

చేవెళ్ల: చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని ఎనిమిది దుకాణాలు వేలం వేయనున్నట్లు.. ఏడాదిపాటు అద్దెకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి మహేందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న నాలుగు కమర్షియల్ దుకాణాలు, నాలుగు రైతు బజార్ దుకాణాలకు సంబంధించి టెండర్ల ద్వారా అద్దెకు ఇచ్చేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 27 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రూ.వేయి చెల్లించి మార్కెట్ కార్యాలయంలో దరఖాస్తు ఫారంలు లభిస్తాయని చెప్పారు. దరఖాస్తుదారులు టెండర్లలో పాల్గొనేందుకు కమర్షియల్ దుకాణాలకు రూ.50 వేలు, రైతు బజారు దుకాణాలకు రూ.25వేలు మార్కెట్ కార్యదర్శి చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చేవెళ్ల పేరిట డీడీ తీసి 28వ తేదీ సాయంత్రం లోపు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 28న చేవెళ్ల మార్కెట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందని చెప్పారు. వివరాలకు చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా బొడ్రాయి పండుగ



పూజలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

షాబాద్: మండల పరిధిలోని నాన్‌ంధార్‌ఖాన్ పేట్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సావాలకు మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ లింగం, ఎంపీటీసీ మాజీ సభ్యులు పొన్న వెంకట్‌రెడ్డి, అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్ధన్‌రెడ్డి, ఖాజా మియా, నాయకులు లింగారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చెన్నయ్య, రాజుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, గౌరీ, శేఖర్ తదితరులున్నారు.

రశీదులు తప్పనిసరి

మండల వ్యవసాయ అధికారి గోపాల్

కొత్తూరు: ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులు సంబంధిత దుకాణం నుంచి తప్పక రశీదులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటల దిగుబడి పూర్తయ్యే వరకు వాటిని భద్రపర్చుకోవాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే ముందు ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీలను గమనించాలని చెప్పారు. సీల్డు ప్యాకెట్లలో నాణ్యమైన, గుర్తింపు ఉన్న పరిశ్రమల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.

పేదల కల సాకారం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- పలువురికి మంజూరు పత్రాలు అందజేత



ఆమనగల్లు: నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ పాలనలో నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని, నియోజకవర్గానికి 4500 ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆమనగల్లు మండలం సీతారాంనగర్‌తండా, ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి సంకటోనిపల్లి గ్రామంలో బుధవారం పలువురు లబ్ధిదారులకు ఆయన ప్రొసీడింగ్‌లు అందజేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడారు.

మాట తప్పిన బీఆర్‌ఎస్

గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఎవరికీ ఇవ్వలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలో వచ్చిన అనంతరం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. వెంటనే లబ్ధిదారులకు ఇంటిపనులు మార్కింగ్ చేసుకుని, నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఆ వెంటనే బిల్లులు వస్తాయని తెలిపారు. అర్హత ఉండి ఇల్లు రానివారికి రెండో విడతలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, హౌసింగ్ డీఈ సురేశ్, ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ యాట గీత, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీ ధనుంజయ, మార్కెట్ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం రవీందర్, అంజయ్య, ఎస్‌ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జై బాపు.. జై భీమ్

అధికార పార్టీ ఆధ్వర్యంలో సంకటోనిపల్లి నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలతో ఊరేగింపు చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. పార్టీ నాయకులు విజయ్, వస్పుల శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సాయి, అలీం, ఫరీద్, నాజర్, ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

కడ్తాల్: నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి మక్తమాదారం గ్రామంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలతో కలిసి లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని పేర్కొన్నారు. మొదటి విడతలో సొంత స్థలం ఉండి, ఇల్లులేని వారికి రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు షాబుద్దీన్, మోత్యానాయక్, నరేందర్, మహేశ్, అశోక్ గృహ నిర్మాణ శాఖ అధికారులు శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

నేడు పత్రాల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంతో పాటు పెద్దఅంబర్‌పేట పురపాలక పరిధి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అందజేయనున్నారని అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దఅంబర్‌పేట ఎస్‌ఎన్‌ఆర్ కళాహాల్‌లో ఉదయం 11గంటలకు ఎంపిక చేసిన 804 మందికి ప్రొసీడింగ్‌లు అందజేయనున్నామని, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వలసవెళ్లిన వారికి..

కడ్తాల్: నిరుపేదలతో పాటు, పొట్ట కూటి కోసం వలస వెళ్లి, పేదరికం అనుభవిస్తున్న కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని, వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా నాయకుడు నింగ్యారి యాదగిరి కోరారు. బుధవారం కడ్తాల్ మండలం మక్తామాధారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా నిజమైన అర్హులను గుర్తించాలని పేర్కొన్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను తొలి ప్రాధాన్యతగా గుర్తించి, వారికి ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు.

అదునులో వర్షాలు..

- ఎండ నుంచి ప్రజలకు ఉపశమనం
- సాగు పనుల్లో అన్నదాతలు నిమగ్నం

యాచారం: మండల పరిధి పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో ఎండ తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగినట్లు అయింది. మరి కొది రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో.. ప్రస్తుతం కురిసిన వాన.. రైతులకు ఊరటనిచ్చింది. మూడేళ్లుగా భారీ వర్షాలు లేక, చెరువులు, కుంటల్లోకి నీళ్లు రాలేదు. దీంతో కర్షకులు వర్షాలపైనే ఆధారపడి మెట్ట పంటలను సాగు చేస్తు జీవనోపాధి పొందుతున్నారు. పక్షం రోజుల క్రితం కురిసిన స్వల్ప వర్షాలకు ఆయా గ్రామాల్లోని అన్నదాతలు తమ వ్యవసాయ పొలాల్లో కంపచెట్లను తొలగించి, చదును చేసుకున్నారు. తక్కళ్లపల్లి, కొత్తపల్లి, నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, మల్కీజ్‌గూడ, నస్దిక్‌సింగారం, చింతుల్ల, చౌదర్‌పల్లి, గునుగల్, గడ్డమల్లయ్యగూడలో సాగుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు.



యాచారంలో కురుస్తున్న వాన

అద్దెభవనంలోకి అంగన్‌వాడీ కేంద్రం!

సాక్షి ఎఫెక్ట్..

కందుకూరు: శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం. అక్కడికి పిల్లలను పంపడానికి ఇష్టపడని తల్లిదండ్రులు అని పేర్కొంటూ బుధవారం 'శిథిలావస్థలో అంగన్‌వాడీ' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీలత, జ్ఞానేశ్వరి, సబిత మండల పరిధి ఆకులమైలారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ పెద్దలు, ఏఎల్‌ఎంఎస్‌సీ(అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ కమిటీ) సభ్యులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీ పరిధిలో స్థలం చూపితే ఎవరి సహాయంతోనైనా నూతన భవనాన్ని నిర్మించుకుందామని, అప్పటి వరకు తాత్కాలికంగా అద్దె భవనంలోకి మార్చాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఐసీడీఎస్ అధికారులు, కమిటీ సభ్యులు

రుణాలు వినియోగించుకోండి

పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్

ఆమనగల్లు: పీఏసీఎస్‌ల ద్వారా సన్న, చిన్నకారు రైతులకు అందిస్తున్న దీర్ఘకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని డీసీసీబీ శాఖ ఆవరణలో బుధవారం పలువురు రైతులకు మంజూరైన దీర్ఘకాలిక రుణాలను డీసీసీబీ మేనేజర్ అరుణతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్‌ల ద్వారా పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం కోసం ట్రాక్టర్, డెయిరీ, పౌల్ట్రీఫాంల ఏర్పాటుకు దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామని, రైతులు వాటిని వినియోగించుకోవాలని కోరారు. పొందిన రుణాలను సకాలంలో చెల్లించాలని, అప్పుడే మరికొంత మందికి రుణాలు అందించేందుకు వీలు కలుగుతుందని వివరించారు. పీఏసీఎస్ సీఈఓ దేవేందర్, సిబ్బంది మహేశ్, కిసాన్ మిత్ర డైరెక్టర్ రమేశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులకు రుణాల ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్

నేడు హనుమాన్ జయంతి



మహేశ్వరం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహేశ్వరం మండలం ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయం హనుమాన్ జయంతి ఉత్సవాలకు ముస్తాబైంది. సుమారు 500 వందల ఏళ్ల నాటి అక్కన్న మాదన్న కాలం నాటి ఆలయ ఉత్సవాలను ఏటా కమిటీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తారు. స్వయంభువుగా వెలసిన స్వామివారు.. దక్షిణ ముఖం కలిగి తూర్పునకు నమస్కారం చేసి ఉంటారు. భక్తుల కొంగు బంగారమైన స్వామివారి ఆలయాన్ని.. ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు ప్రభుత్వ ప్రోత్సాహంతో అభివృద్ధి చేస్తున్నారు. గురువారం జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 5.30 గంటలకు పంచామృతాభిషేకం, 7 గంటలకు నాగవల్లి పూజ(లక్ష తమలపాకుల పూజ), 8 గంటలకు మన్యూసూక్త హోమం, మధ్యాహ్నం 1 గంటకు హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు వేద పండితుల సమక్షంలో నిర్వహిస్తారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హాజరు కానున్నారని ఆలయ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సీపీఐతోనే దోపిడీ లేని వ్యవస్థ సాధ్యం

- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: ఎర్ర జెండా ద్వారానే అసమానతలు లేని సమ సమాజ సోషలిస్టు వ్యవస్థ సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి అన్నారు. బుధవారం నిర్వహించిన బాలాపూర్ మండల మీర్‌పేట శాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలు, కార్మికులు, శ్రామికులు, మహిళల పక్షాన తరఫున నిరంతరం ఉద్యమాలు చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. దోపిడీ లేని వ్యవస్థ రావాలంటే కమ్యూనిస్టు పార్టీల పోరాటాల ద్వారానే సాధ్యమని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లోనూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం 11 మందితో మీర్‌పేట శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండ యాదయ్య యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు శివనాయక్, జిల్లెలగూడ శాఖ కార్యదర్శి పాండునాయక్, కార్యవర్గ సభ్యులు జాజుల అంజయ్య, ఛత్రునాయక్ పాల్గొన్నారు.



మీర్‌పేట శాఖ మహాసభలో పాల్గొన్న రవీంద్రాచారి

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కాంగ్రెస్ చేవెళ్ల నియోజవకర్గ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు చేకూతుందని కాంగ్రెస్ నియోజకవకర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డికి మంజూరైన రూ.60వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం బాధ్యతగా తీసుకుంటామని చెప్పారు. టీపీసీసీ కార్యదర్శి సతీష్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పెంటారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, నవీన్ ఉన్నారు.

56 మంది బాధితులకు..

మొయినాబాద్ రూరల్: అర్హులైన పేదలందరికీ సీఎంఆర్‌ఎఫ్ అంజేస్తున్నామని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్, డీసీసీ ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పార్టీ కార్యాలయంలో 56 మంది బాధితులకు మంజూరైన రూ.4.85లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.



బాధితుడికి చెక్కు అందజేస్తున్న భీంభరత్

జాడలేని ఓపెన్ జిమ్

రూ.10 లక్షలు మంజూరు

- రెండేళ్లు దాటినా పట్టించుకోని అధికారులు

బడంగ్‌పేట్: ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యమని, అందుకు రోజువారి వ్యాయామం చాలా అవసరమని గుర్తించిన ప్రభుత్వం ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ పరిధి 21వ డివిజన్ భీష్మానగర్ కాలనీలో జిమ్ ఏర్పాటుకు 240 గజాల స్థలం కేటాయించింది. కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించింది. 2023 మేలో నాటి విద్యాశాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి.. కార్పొరేటర్ బంగారు అనితతో కలిసి జిమ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కానీ నేటి వరకు ఓపెన్ జిమ్‌కు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. శిలాఫలకం చుట్టూ గడ్డి పెరిగి, అపరిశుభ్రంగా మారింది. ఇదిలా ఉండగా.. కుటుంబంలో నలుగురు ఉంటే ప్రైవేట్ జిమ్‌కు వెళ్లాలంటే సుమారు రూ.15 నుంచి 20 వేల దాక ఖర్చు అవుతుందని, ప్రభుత్వం జిమ్ ఏర్పాటు చేస్తే స్థానికులందరికీ ఉపయోగంగా ఉంటుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. శంకుస్థాపన చేసి రెండేళ్లు గడుస్తున్నా.. జిమ్ జాడ కానరావడం లేదని, ఎవరూ దాని ఊసెత్తడం లేదని వాపోతున్నారు.



ఓపెన్ జిమ్‌కు కేటాయించిన స్థలం

కాలనీపై చిన్నచూపు



జిమ్ కోసం ఎదురు చూస్తున్నాం. శంకుస్థాపన చేసినప్పుడు నెల రోజుల్లోనే పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తెస్తామని పాలకులు, అధికారులు హామీ ఇచ్చారు. రెండేళ్లు గడిచినా అది నెరవేడం లేదు. అడిగినా పట్టించుకునే వారు లేరు. భీష్మానగర్ కాలనీపై అధికారులు, రాజకీయ నాయకులు చిన్నచూపు చూస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి త్వరగా జిమ్ ఏర్పాటు చేయాలి.

– బంగారు సురేష్, స్థానికుడు

సాంకేతిక విప్లవ ఆద్యుడు రాజీవ్

- ఆధునిక భారతాన్ని నిర్మించడంలో ఆయన పాత్ర ఎనలేనిది
- రాజీవ్‌గాంధీ వర్ధంతిలో కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: 'సాంకేతిక విప్లవానికి ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ. ఆయన పాలనలో దేశంలో సమాచార విప్లవం ప్రారంభమైంది. కంప్యూటరైజేషన్, టెలీ కమ్యునికేషన్ వ్యవస్థలు వచ్చాయి' అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కసిరెడ్డి, పలువురు పార్టీ నాయకులు పూలమాలలు నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక స్వపరిపాలన సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజీవ్ కృషి చేశారని, ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని పేర్కొన్నారు. ఆధునిక భారతాన్ని రూపొందించడంలో ఆయన పాత్ర ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటగీత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల శాఖ అధ్యక్షుడు జగన్, పట్టణ శాఖ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకులు ఖాదర్, విజయ్, అలీం, కరీం, నాజర్, మహేశ్, వెంకట్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనునాయక్, కండెసాయి, మెకానిక్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ సేవలు చిరస్మరణీయం

కడ్తాల్: రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధి మక్తమాధారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు: రాజీవ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు